సాక్షి
సూర్యాపేట
గురువారం ׀ 7 ׀ మార్చి ׀ 2024



పోచంపల్లిలో కొలంబియన్స్

భూదాన్ పోచంపల్లిలో బుధవారం వోల్గా గ్రూప్‌కు చెందిన 9 మంది కొలంబియా దేశస్తులు సందడి చేశారు.
- 8లో



వైభవంగా శివరాత్రి ఉత్సవాలు

యాదాద్రిలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.
- 8లో



డీజిల్ దొంగల ముఠా అరెస్ట్

డీజిల్ దొంగల ముఠాను వాడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నగదు, డీజిల్ స్వాధీనం చేసుకున్నారు.
- 8లో

బ్లాక్‌స్పాట్.. ఫుల్‌స్టాప్!



ఫ్లై ఓవర్ నిర్మాణం జరగనున్న కొమరబండ వద్ద వై జంక్షన్

- ఉమ్మడి జిల్లాలో 65వ నంబర్ హైవేపై పలు చోట్ల జంక్షన్ల అభివృద్ధి
- మూడు చోట్ల ఫ్లైఓవర్ల నిర్మాణం
- రూ.288 కోట్లకు పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ
- వారంరోజుల్లో అగ్రిమెంట్ చేసుకోనున్న అధికారులు
- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రణాళిక

కోదాడ: ఉమ్మడి జిల్లా పరిధిలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చేపట్టిన బ్లాక్‌స్పాట్‌ల అభివృద్ధికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఏడాదిన్నరగా నానుతూవస్తున్న టెండర్ల ప్రక్రియ కొలిక్కి వచ్చింది. హరియాణాకు చెందిన ఓ కాంట్రాక్ట్ సంస్థ 11 శాతం లెస్‌తో రూ.288 కోట్లకు పనులు దక్కించుకుంది. కొద్ది రోజుల్లోనే పనులు ప్రారంభించనున్నట్లు నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు చెబుతున్నారు.

11శాతం లెస్‌కు..

ఉమ్మడి జిల్లాలో సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు నుంచి యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వరకు సుమారు 183 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి–65 విస్తరించి ఉంది. నిత్యంరద్దీగా ఉండే హైవేను నాలుగు లేన్లుగా విస్తరించినా కొన్నిచోట్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని అధికారులు బ్లాక్‌స్పాట్స్ (తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలు)గా గుర్తించారు. వీటి అభివృద్ధికి రూ.326 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేసి టెండర్లు పిలిచారు. కానీ కాంట్రాక్టర్లు ఎక్కువ ధరకు కోట్ చేయడంతో పలుమార్లు వాటిని రద్దు చేశారు. తాజాగా మళ్లీ టెండర్లు పిలిచి మంగళవారం తెరిచారు. దీనిలో హరియాణాకు చెందిన రామ్‌కుమార్ కాంట్రాక్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 11శాతం లెస్‌తో రూ.288 కోట్లకు కాంట్రాక్ట్ దక్కించుకుంది. వారం రోజుల్లో ఆకంపెనీతో అగ్రిమెంట్ కుదుర్చుకొని పనులు ప్రారంభించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

ఎక్కడెక్కడ ఏం చేస్తారంటే..

ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారి ప్రారంభం కానున్న కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్డు వద్ద ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఆ తరువాత కోదాడ పట్టణ సమీపంలోని దుర్గాపురం క్రాస్ రోడ్డు వద్ద, కట్టకొమ్ముగూడెం వద్ద జంక్షన్లను అభివృద్ధి చేయనున్నారు. కొమరబండ వై జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేయనున్నారు. ఆకుపాముల గంగమ్మగుడి వద్ద, ముకుందాపురం ఎస్సీ కాలనీ సమీపంలో, మునగాల గవర్నమెంట్ వైద్యశాల వద్ద, రేపాల క్రాసింగ్‌లలో జంక్షన్ల అభివృద్ధి, సర్వీస్ రోడ్ల నిర్మాణం, బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు. సూర్యాపేట నియోజకవర్గ పరిధిలో దురాజ్‌పల్లి క్రాసింగ్, జమ్మిగడ్డ క్రాసింగ్, జనగామ క్రాసింగ్‌ల వద్ద ఫ్లై ఓవర్‌ల నిర్మాణం చేయనున్నారు. కొత్త వ్యవసాయ మార్కెట్ క్రాసింగ్ వద్ద జంక్షన్ అభివృద్ధి చేయనున్నారు. నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని పద్మానగర్ జంక్షన్, కట్టంగూర్ వద్ద నల్లగొండ వెళ్లే క్రాసింగ్ అభివృద్ధి చేయనున్నారు. మునుగోడు నియోజకవర్గ పరిధిలోని చిట్యాల, చౌటుప్పల్ గ్రామాలతో పాటు వట్టిమర్తి గ్రామ క్రాసింగ్‌లను అభివృద్ధి చేయనున్నారు. ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, ప్రజల విజ్ఞప్తల మేరకు కొన్ని చోట్ల మార్పులుచేసే అవకాశం ఉందని సమాచారం.

కట్టకొమ్ముగూడెం క్రాసింగ్‌లో ఫ్లైఓవర్ నిర్మించాలి

జాతీయ రహదారిపై కోదాడ పట్టణ సమీపంలో అత్యంత ప్రమాదకరంగా మారిన కట్టకొమ్ముగూడెం క్రాసింగ్ వద్ద కేవలం జంక్షన్ అభివృద్ధి మాత్రమే చేపట్టడం పట్ల కోదాడ పట్టణ వాసులతో పాటు ఈ క్రాసింగ్ నుంచి ప్రయాణించే పలుగ్రామాల వాసులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. గత 10 సంవత్సరాల్లో ఇక్కడ 14 మంది ప్రాణాలు కోల్పోయారని, పదుల సంఖ్యలో క్షతగాత్రులుగా మిగిలారని, ఇక్కడ పట్టణం కూడా విస్తరిస్తున్నందున ఎట్టి పరిస్థితుల్లో ఫ్లైఓవర్ నిర్మాణం చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



అత్యంత ప్రమాదకరంగా మారిన కట్టకొమ్ముగూడెం క్రాసింగ్

ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా అమలు చేయాలి



సూర్యాపేట మున్సిపల్ కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ ధర్నాలో మాట్లాడుతున్న ఎంపీ లింగయ్యయాదవ్

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్
- సూర్యాపేట మున్సిపల్ కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ ధర్నా

సూర్యాపేట: కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఎల్‌ఆర్‌ఎస్‌ను ప్రజలకు ఉచితంగా అమలు చేయాలని రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 25లక్షల మంది ఎల్‌ఆర్‌ఎస్ బాధితులు ఉన్నారని వారిపై రూ.25వేల కోట్ల భారం పడుతోందన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేస్తామని నాడు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పడంతో పాటు ఏకంగా కోర్టుకు వెళ్లారన్నారు. నాడు తమ ప్రభుత్వంలో తప్పు అయ్యింది నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలా కరెక్ట్ అవుతుందని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా చేయాలన్నారు. పదేళ్లుగా సూర్యాపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని ఎంతో విశ్వాసంతో ప్రజలు గెలిపించుకున్నారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బూర బాలసైదులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ పుట్ట కిషోర్ పాల్గొన్నారు.

రైతునేస్తంపై ప్రచారం చేయాలి

- కలెక్టర్ వెంకట్రావు

పెన్‌పహాడ్: రైతు నేస్తంపై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు సూచించారు. బుధవారం రైతు వేదికల్లో రైతు నేస్తం అనే కార్యక్రమాన్ని హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులతో కలిసి ప్రారంభించారు. పెన్‌పహాడ్ గ్రామ రైతు వేదికలో కలెక్టర్ వెంకట్రావు.. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పాల్గొని మాట్లాడారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా పంటలు సాగు చేసి లాభాలు ఆర్జించేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. రైతు వేదికలో ప్రతి మంగళవారం, శుక్రవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి నేరుగా శాస్త్రవేత్తలు రైతులతో ముఖాముఖి నిర్వహించి సలహాలు, సూచనలు అందిస్తారని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ శిరీష, ఎంపీఓ నరేష్, మండల ప్రత్యేక అధికారి రాములు, ఏడీఏ వేణుగోపాల్, పశుసంవర్ధక శాఖ అధికారి జానయ్య, ఎస్‌ఐ రవీందర్ పాల్గొన్నారు.



రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న కలెక్టర్ వెంకట్రావు, అధికారులు

న్యూస్‌రీల్

నూతన దరఖాస్తులు స్వీకరిస్తున్నాం



వెంకట్రావు, కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోలేని వారి కోసం ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా నూతన దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. జిల్లాలోని 23 ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు ఐదు మున్సిపాలిటీల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామని, అన్ని కేంద్రాల్లో పాత దరఖాస్తుల సవరణతో పాటు నూతన దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. అన్ని కేంద్రాలకు లాగిన్‌లు ఇచ్చామని, బుధవారం సాయంత్రం 5 గంటల వరకు 1,038 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. గతంలో దరఖాస్తులు చేసుకోలేని వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటుపై అవగాహన పెంచుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న డీఈఓ, తదితరులు

సూర్యాపేటటౌన్ : ఓటుపై అవగాహన పెంచుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ సూచించారు. బుధవారం స్పందన డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఆ కళాశాల క్యాంపస్ అంబాసిడర్లు ఏర్పాటు చేసిన సమావేశంతో పాటు ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, తమ తోటి వారితో పాటు పొరుగు వారు కూడా ఓటు వేసేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి జనార్దన్, రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్ పబ్బతి వెంకటేశ్వర్లు, వేణు, క్యాంపస్ అంబాసిడర్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్డీఓగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



హుజూర్‌నగర్ : ఆర్డీఓ శ్రీనివాసులుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఏఓ నారాయణ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఆర్డీఓగా వి.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఆర్డీఓగా ఉన్న జగదీశ్వర్‌రెడ్డిని మెదక్ జిల్లా నర్సాపూర్‌కు, అక్కడి ఆర్డీఓ శ్రీనివాసులును హుజూర్‌నగర్‌కు బదిలీ చేసిన విషయం విదితమే. ఆర్డీఓ శ్రీనివాసులును డీఏఓ నారాయణ, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

హజ్ కమిటీ సభ్యుడిగా మౌలానా ఎహసానుద్దీన్



రామగిరి(నల్లగొండ): తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడిగా నల్లగొండ జిల్లా ముస్లిం మత పెద్ద మౌలానా సయ్యద్ ఎహసానుద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మౌలానాను నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి జమియత్ ఉలెమాయే హింద్ నల్లగొండ శాఖ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నేరేడుచర్ల : జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని డీఈఈఓ కృష్ణయ్య అన్నారు. నేరేడుచర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులను దగ్గరుండి తనిఖీ చేసి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన వెంట డీఈసీ సభ్యుడు లక్ష్మయ్య, చీఫ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఉపాధి హామీ సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు హెచ్చరించారు. తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఆయన మాట్లాడారు. తిరుమలగిరి మండలంలో 2022 జనవరి 1 నుంచి 2023 మార్చి 31 వరకు ఏడాది కాలంలో రూ.3,29,85,460 వ్యయంతో ఉపాధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కువ మొక్కలు నాటినట్లు రికార్డుల్లో చూపగా క్షేత్ర స్థాయిలో మాత్రం తక్కువ మొక్కలు ఉన్నట్లు గుర్తించామన్నారు. పని జరిగిన ప్రదేశాల్లో తప్పని సరిగా మళ్లీ మొక్కలు నాటాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా చేసిన పనులపై రూ.1,80,718 రికవరీ చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించాలని సూచించారు. పని ప్రదేశంలో తప్పని సరిగా మస్టర్ ఉంచాలన్నారు. ప్రతి నెలా 3వ శుక్రవారం రోజ్‌గార్ దివస్ నిర్వహించాలని సూచించారు. పని ముగింపు సమయంలో తప్పని సరిగా ఫొటోలు తీసుకొని ఎంబీతో జత చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ శిరీష, అంబుడ్స్‌మన్ లచ్చునాయక్, విజిలెన్స్ అధికారి ఆశ, ఎంపీడీఓ లాజరస్, ఎస్‌టీఎం అజయ్, ఎస్ఆర్‌పీ నాగరాజు, ఏపీఓ లక్ష్మి పాల్గొన్నారు.

చిలుకూరు సొసైటీ ప్రథమ స్థానం



చిలుకూరు పీఏసీఎస్‌లో నాబార్డు బృందం

చిలుకూరు: దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలతో పాటు బంగారంపై లోన్లు ఇవ్వడంలో చిలుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉమ్మడి జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచిందని నాబార్డు బృందం ప్రతినిధులు వెల్లడించారు. చిలుకూరు ప్రాథమిక సహకార సంఘాన్ని బుధవారం వారు పరిశీలించి మాట్లాడారు. సంఘాలను పూర్తి స్థాయి కంప్యూటీకరణ చేసినట్లుగా తెలిపారు. సంఘం అభివృద్ధికి నాబార్డు నుంచి నిధులు మంజూరు చేసి సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ సోమరాజ్‌భట్రాజీ, డిస్ట్రిక్ డెవలప్‌మెంట్ మేనేజర్లు సత్యనారాయణ, వినయ్‌కుమార్, డీసీసీబీ మేనేజర్ సుధాకర్, సొసైటీ చైర్మన్ అలసకాని జనార్దన్, ఈసీఓ లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు కొండా సోమయ్య, రాంబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తీసుకోవాలి



గుండె పరీక్ష చేస్తున్న డాక్టర్ కరుణాకర్ , చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక తదితరులు

సూర్యాపేటటౌన్ : ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తీసుకోవాని జెడ్పీ చైర్ పర్సన్ గుజ్జా దీపిక సూచించారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో నేరేడుచర్ల జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య ఆధ్వర్యంలో ఆయన కుమారుడు అపోలో ఆస్పత్రి ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ రాపోలు కరుణాకర్ చే ఉచిత గుండె వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరుల కోసం డాక్టర్ కరుణాకర్ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి అవకాశాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కరోనా తర్వాత ప్రతి ఒక్కరి ఆరోగ్యం ఏ నిమిషానికి ఏం జరుగుతుందో తెలియని పరిస్థితులో ఉన్నామని, ప్రతి సంవత్సరం కచ్చితంగా మెడికల్ చెకప్‌లు చేయించుకోవడం ఎంతో శ్రేయస్కరమన్నారు. ఈ వైద్య శిబిరంలో 150 మంది పాల్గొని చెకప్‌లు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష, గుజ్జా యుగంధర్‌రావు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలి

నల్లగొండ రూరల్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించి భావి శాస్త్రవేత్తలుగా రాణించాలని ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల ప్రొఫెసర్ జీబీ రెడ్డి అన్నారు. బుధవారం ఎంజీయూ యూనివర్సిటీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న చిన్న ప్రయత్నాలతో భారీ ఆవిష్కరణలకు పదును పెట్టాలన్నారు. కొత్త ఆలోచనలను ఆచరణలోకి తీసుకొస్తే ఏదైనా సాధించవచ్చన్నారు. యూనివర్సిటీలో ఉన్న పరిశోధన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీసీ గోపాల్‌రెడ్డి, అధ్యాపకులు అంజిరెడ్డి, రమేష్, ప్రేమ్‌సాగర్, ప్రశాంతి, రమేష్, భిక్షమయ్య, మశ్చేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓయూ ప్రొఫెసర్ జీబీ రెడ్డి

డివైడర్, సెంట్రల్ లైటింగ్‌కు నిధులు మంజూరు

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై డివైడర్, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం తుంగతుర్తి మండల కేంద్రంలో ఆయన అధికారులతో కలిసి సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుకు రోడ్డు వెడల్పును పరిశీలించి మాట్లాడారు. తుంగతుర్తిలోని అంబేద్కర్ విగ్రహం నుంచి జూనియర్ సివిల్ కోర్టు వరకు రోడ్డును వెడల్పు చేసి డివైడర్ ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని నేషనల్ హైవే వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు. ఈ పనుల కోసం రూ.4కోట్ల నిధులు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. రోడ్డు పనులకు టెండర్ పూర్తయ్యిందని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ డీఈఈ పద్మావతి, ఏఈఈ యుగంధర్, సంకినేని రవీందర్‌రావు, ఓరుగంటి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

భానుడు భగభగ.. మీటరు గిరగిరా!

- జిల్లాలో పెరిగిన విద్యుత్ వినియోగం
- ఈనెలలో ఐదు రోజుల్లో 57.39 మిలియన్ యూనిట్ల వాడకం
- గత ఏడాదితో పోలిస్తే 5.10 మిలియన్ యూనిట్లు పెరుగుదల



నాగారం : వేసవి కాలం ప్రారంభం కావడంతో రోజు, రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భానుడి భగభగలతో జిల్లాలో ఉదయం 9గంటల నుంచే వేడిగాలుల ప్రభావం ఉంటోంది. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందటానికి ప్రజలు ఫ్యాన్లు, కూలర్లు వినియోగిస్తున్నారు. దీనికి తోడు ఈ ఏడాది వర్షాభావంతో వేసవి పంటల సాగుకు నీటి వినియోగం వంటి కారణాలతో మార్చి ప్రారంభం నుంచే విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఈనెలలో ఐదు రోజుల్లోనే 57.39 మిలియన్ యూనిట్లు కరెంటు వాడారు. గత ఏడాదితో పోలిస్తే 5.10 మిలియన్ యూనిట్లు పెరిగినట్లయ్యింది.

మార్చిలో విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో)

తేదీ	2023	2024
1	10.59	11.56
2	10.54	11.67
3	10.51	11.38
4	10.21	11.36
5	10.44	11.42
మొత్తం	52.29	57.39

పంటల సాగుకు అధికంగానే...

జిల్లాలో ఈ ఏడాది 3,84,096 లక్షల ఎకరాల్లో యాసంగి పంటలు సాగు చేస్తున్నారు. 3,81,375 ఎకరాల్లో వరి, 663 ఎకరాల్లో వేరుశనగా, 487 ఎకరాల్లో మొక్కజొన్న, 463 ఎకరాల్లో జొన్న, 286 ఎకరాల్లో పెసర, 253 ఎకరాల్లో నువ్వులు, 137 ఎకరాల్లో బొబ్బర్లు, 432 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంటలు అధికంగా బోరు బావులే కిందే సాగువుతున్నాయి. ప్రభుత్వం 24గంటల పాటు సాగుకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తోంది. మున్ముందు సాగుకు నీటి అవసరం అధికంగా ఉంటుంది. దీంతో రానున్న రోజుల్లో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది. పంచాయతీలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు కూడా భారీగానే విద్యుత్ వినియోగిస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో గృహావసరాలు, వాణిజ్య, వ్యవసాయం తదితర వాటికి సంబంధించి 5,09,970 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహ విద్యుత్ వినియోగ కనెక్షన్లు 3,21,459, వాణిజ్య 38,975 కనెక్షన్లు, వ్యవసాయానికి సంబంధించిన 1,49,536 కనెక్షన్లు ఉన్నాయి.

వేసవిలో కరెంటు వాడకం పెరిగింది



వేసవి కాలం ప్రారంభం కావడంతో జిల్లాలో గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరుగుతోంది. జిల్లాలో విద్యుత్ డిమాండ్ పెరిగినా అందుకు అనుగుణంగా సరఫరా చేస్తున్నాం. వేసవిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాం.

– శ్రీనివాస్, విద్యుత్‌శాఖ డీఈఈ, సూర్యాపేట.

పెరిగిన విద్యుత్ వాడకం

జిల్లాలో గృహ, వ్యవసాయానికి విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగింది. జిల్లాలో అత్యధిక శాతం వరి పంట సాగు చేస్తుండటం, దీనికితోడు వేసవి కాలం కావడంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. అలాగే ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద ఆహార భద్రత కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ నెలకు 200 యూనిట్ల విద్యుత్ సరఫరా చేస్తోంది. వినియోగదారులకు జీరో బిల్లులు కూడా వస్తున్నాయి. 200 యూనిట్ల విద్యుత్ వాడకంపై ఎలాంటి ఆంక్షలు విధించకపోవడంతో చాలా మంది వినియోగదారులు గృహావసరాలకు అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. మొన్నటి వరకు ఒక ఇంట్లో ఒకటి, రెండు బల్బులు, ఫ్యాన్ వాడే వారు 200 యూనిట్ల వరకు జీరో బిల్లు కావడంతో ఇకపై గృహాల్లో కూలర్లు, ఫ్రిజ్‌లు, మోటార్లు, కుక్కర్లు, మిక్సీలు వాడే అవకాశం ఉంది. సాధారణంగా 100 యూనిట్ల లోపు బిల్లులు వచ్చే లబ్ధిదారులు జిల్లాలో అధికంగా ఉన్నారు. ఇప్పుడు వీరంతా గతంలో కంటే ఎక్కువ విద్యుత్ వినియోగించే అవకాశం ఉండటంతో యూనిట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గృహావసరాల వాడకం పెరిగితే జిల్లాలో వినియోగం మరింత పెరుగుతుంది.

క్లుప్తంగా

అన్వితారెడ్డికి సన్మానం



అన్వితారెడ్డిని సన్మానిస్తున్న గవర్నర్

భువనగిరి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లో రాచకొండ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహిళలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతారోహణ విభాగంలో భువనగిరి పట్టణానికి చెందిన పడమటి అన్వితారెడ్డిని సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్వితాను శాలువతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

డ్రగ్స్ కంట్రోల్ అధికారుల తనిఖీలు

నల్లగొండ టౌన్: జుట్టు పెరిగే మందుల పేరిట నకిలీ ఔషధాలు విక్రయిస్తున్న వారి గుట్టును డ్రగ్స్ కంట్రోల్ అధికారులు బుధవారం రట్టు చేశారు. నీలగిరి పట్టణంలోని పలు మందుల దుకాణాల్లో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జుట్టు పెరగటం కోసం అంటూ గుజరాత్‌కు చెందిన హీలాంగ్ ఫార్మా సంస్థ మైనోక్షిటోన్ సొల్యూషన్ మందులను మార్కెట్లో డ్రగ్స్ కాస్మోటిక్ యాక్ట్ కు విరుద్ధంగా అమ్ముతున్నారని తెలుసుకున్న సంబంధిత అధికారులు కేసు నమోదు చేశారు. బట్టతల ఉండి జుట్టు ఊడిపోయిన వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అందమైన లేబుళ్ల ద్వారా ఈ నకిలీ ఔషధాలను విక్రయిస్తున్నారని అధికారులు తెలిపారు. డ్రగ్స్ కాస్మోటిక్ యాక్ట్‌కు విరుద్ధంగా నకిలీ మందులను విక్రయించినట్లయితే రెండు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధిస్తామన్నారు. ఈ తనిఖీల్లో ఉమ్మడి జిల్లా అడిషనల్ డైరెక్టర్ దాస్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కె. సోమేశ్వర్, సురేందర్, అశ్వినికుమార్ పాల్గొన్నారు.

హాకీ పోటీలకు ఎంపిక

చిట్యాల : చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన మర్రి కల్పన జాతీయ స్థాయి మహిళల హాకీ పోటీలకు ఎంపికైనట్లు హాకీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కూతురు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి ఇమామ్‌కరీం తెలిపారు. వనపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కల్పన మార్చి 13నుంచి మహారాష్ట్రలోని పూణెలో జరిగే జాతీయస్థాయి హాకీ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నది.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చిట్యాల : పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సివిల్‌సప్లయీస్ అధికారులు పట్టుకున్నారు. బుధవారం చిట్యాల మండలంలోని వెల్మినేడు శివారులో సివిల్‌సప్లయీస్ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పదిబస్తాల పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనం పట్టుబడింది. బియ్యం తరలిస్తున్న బానోతు శంకర్‌ను విచారించగా వెల్మినేడు పరిసర గ్రామాల్లో కొనుగోలు చేసి కోళ్లఫారం నిర్వాహకులకు విక్రయించేందుకు తీసుకువెళ్తున్నట్లు తెలిపాడు. వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు డీటీ లింగస్వామి తెలిపారు.

కారు ఢీకొని దంపతులకు గాయాలు

రామగిరి(నల్లగొండ): కారు ఢీకొని దంపతులకు గాయాలయ్యాయి. ఈ ఘటన తిప్పర్తి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన మహ్మద్ మన్సూర్ అలీ, తన భార్య జుబేదా బేగంతో కలిసి నల్లగొండ పట్టణం బీటీఎస్‌లో ఉంటున్న కూతురు ఇంటి వద్దకు వచ్చారు. తిరిగి బుధవారం టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెంకటాద్రిపాలెం గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో అనిశెట్టి దుప్పలపల్లి వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా హైదరాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. కొడుకు జహంగీర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా మహా శివరాత్రి ఉత్సవాలు

- రెండో రోజు ధ్వజారోహణం, దేవతాహ్వానం, భేరీ పూజ



భేరీ పూజ నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజైన బుధవారం ఉదయం నిత్య హవనములు, శివపంచాక్షరీ జపములు, నందీశ్వర పారాయణం, పంచసూక్త పఠనం, మూలమంత్ర జపములు, వివిధ పారాయణములు నిర్వహించారు. అనంతరం ధ్వజపటంపై పరమేశ్వరుడి వాహనమైన నందీశ్వరుని, అష్టమంగళ చిత్రాలను చిత్రీకరించి ఆలయ ఉపచారములు గావించి ధ్వజస్తంభంపై అలంకరించి నందీశ్వర ధ్వజారోహణ కార్యక్రమాన్ని జరిపించారు. అనంతరం పరమేశ్వరుడిని అర్చించిన అపమృత్యుదోషము తొలగి శుభపరంపరలు కలుగాలని భేరీ పూజ నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగేలా చూడాలని కోరుతూ దేవతాహ్వాన కార్యక్రమాన్ని చేపట్టారు.



దేవతాహ్వానం పూజ జరిపిస్తున్న అర్చకులు

ఆలయ యాగశాలలో అగ్ని ప్రతిష్ట

ఉత్సవాల్లో భాగంగా ఆలయ యాగశాలలో అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలకు విచ్చేసిన సకల దేవకోటికి ఉత్సవాంతం వరకు ప్రతి నిత్యం హవిస్సును అందిచడానికి ఈ అగ్ని ప్రతిష్ఠ వేడుకను చేపట్టారు. పంచసూక్త హవనములు, మూతమంత్ర, మూర్తిమంత్ర జపములతో దశాంగతర్పణాదులు స్మార్తాగమరీత్యా నిర్వహించారు. ఇక సాయంత్రం పారాయణికులచే స్తోత్ర, వేద, సమక, చమర పారాయణములు, మంత్ర పుష్ప పఠనములు, సోమకుంభార్చనలు, మూలమంత్ర పారాయణములు యథావిధిగా నిర్వహించి, లఘు పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, ఆల య సిద్ధాంతి, ప్రధానార్చకులు, పారాయణికులు పాల్గొన్నారు.



ధ్వజరోహణంలో భాగంగా నందీశ్వరుడి పటానికి హారతినిస్తున్న ఆచార్యులు

కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా ఏపీజీవీబీ

- రూ.1046 కోట్ల నికర లాభాలు
- ఏపీజీవీ బ్యాంకుల చైర్మన్ ప్రతాపరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజీవీబ్యాంకుల చైర్మన్ ప్రతాపరెడ్డి

భూదాన్‌పోచంపల్లి : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు రూ.1046 కోట్ల నికర లాభాలు ఆర్జించి కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా ముందంజలో ఉందని ఏపీజీవీబ్యాంకుల చైర్మన్ కె. ప్రతాపరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణకేంద్రంలో ఏపీజీవీ బ్యాంకు ఆధ్వర్యంలో 75మంది చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మొత్తం కోటిన్నర చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే పోచంపల్లి ఏపీజీవీ బ్యాంకు రూ.100 కోట్ల టర్నోవర్ మైలురాయి దాటినందుకు హర్షం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రాల్లో 771 బ్రాంచ్‌లలో 79లక్షల మంది ఖాతాదారులు ఉన్నారని చెప్పారు. రూ.25వేల కోట్లు డిపాజిట్లు సేకరించి, రూ. 27వేల కోట్ల రుణాలు ఇచ్చామని పేర్కొన్నారు. దేశంలో ఉన్న 43గ్రామీణ బ్యాంకుల్లో ఏపీజీవీ బ్యాంకు లావాదేవీలు, టెక్నాలజీ, నెట్ ప్రాపిట్‌లో నెంబర్‌వన్ స్థానంలో ఉందని తెలిపారు. రాబోయే పదేళ్లలో బ్యాంకు లక్ష కోట్ల టర్నోవర్ సాధించే దిశగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఏపీజీవీ బ్యాంకు ద్వారా క్యాష్‌క్రెడిట్ రుణాలు, వ్యక్తిగత, గృహ, మార్టిగేజ్, ఎస్‌హెచ్‌జీ, విద్యా, వ్యాపార, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు అందిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడ అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్టక్చర్ స్కీమ్‌కింద లక్ష కోట్లబడ్జెట్ కేటాయించిందని వెల్లడించారు. ఈ స్కీమ్ కింద రైతులకు విరివిరిగా రుణాలు ఇస్తున్నామని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంజెజెవైఏ, ఏపీవై తదితర బీమా పథకాలను సైతం అమలు చేస్తున్నామని వివరించారు. వినియోగదారులు కూడా బ్యాంకుల ద్వారా తీసుకొన్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం చైర్మన్ కె. ప్రతాపరెడ్డిని పలువురు చేనేత వ్యాపారులు, కార్మికులు, బ్యాంకు సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భువనగిరి రీజినల్‌మేనేజర్ పి.సమత, పోచంపల్లి బ్రాంచ్ మేనేజర్ ఆకుల కిరణ్‌సింహ, బ్యాంకు సిబ్బంది నిఖిల్‌కుమార్, మౌనిక, జి.కార్తీక్, హరిణిమా, అంజయ్య, చేనేత నాయకులు ఎం. రాజారమేష్, తాటి నర్సింహ, భారత లవకుమార్, భోగ బాలయ్య, సరస్వతీ, భోగ విష్ణు, ముస్కూరి నర్సింహ, బోడ దయానంద్, ఆటిపాముల నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి ప్రాణప్రతిష్ఠ

- హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం

భువనగిరి : భువనగిరి పట్టణ శివారులో నిర్మించిన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వస్వామి దేవాలయ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం మానేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి తిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి హాజరై ఆలయ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మానేపల్లి రామారావు, విజయలక్ష్మీ,మురళీ కృష్ణ, గోపి కృష్ణ, స్థపతి ప్రసాద్ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కూడా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట ఆమె వెంట జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ధనుంజయ్, ఎస్‌ఐ రామ్మూర్తి

కొండమల్లేపల్లి : ద్విచక్రవాహనాలను అపహరిస్తున్న ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్, ఎస్‌ఐ రామ్మూర్తి నిందితుల వివరాలు వెల్లడించారు. కొండమల్లేపల్లి మండల పరిధిలోని కేశ్యతండాకు చెందిన రమావత్ లచ్చు గత నెల 28న తన ఇంటి ముందు ఉంచిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ మేరకు లచ్చు కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే కొండమల్లేపల్లి ఎస్‌ఐ రామ్మూర్తి బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఆర్టీసీ బస్టాండు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో కొర్ర బంటు అలియాస్ ఆంజనేయులు, శీలంపవన్ బాబు, లింగం గుంట్ల రాముడు ఈ ముగ్గురు వ్యక్తులు రెండు బైకులపై అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ మేరకు బైక్‌ను చోరీ చేసినట్లు వారు ఒప్పుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా బైక్ చోరీ జరిగిన రోజునే ఈ ముగ్గురు గుడిపల్లి మండలంలోని నీలంనగర్ వద్ద ఓ ఇంటి ముందు పార్క్ చేసి ఉంచిన పల్సర్ బైక్‌ను కూడా దొంగలించినట్లు విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు వీరి నుంచి రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురు కలిసి నాగార్జునసాగర్ పైలాన్‌లో ఉంటూ పలు దొంగతనాలకు పాల్పడేవారు. గతంలో కూడా వీరిపై కేసు కూడా నమోదైనట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు ఈ ముగ్గురిని రిమాండ్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ రామ్మూర్తి, గుడిపల్లి ఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది హేమానాయక్, భాస్కర్, వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డిలను డీఎస్పీ గిరిబాబు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మిర్యాలగూడ అర్బన్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని చింతపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన చిలుముల భానుప్రసాద్(23) ద్విచక్ర వాహనంపై ఈదులగూడ వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చింతపల్లి క్రాస్‌రోడ్డు వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఇతడి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భానుప్రసాద్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా మృతుడి తండ్రి శంకర్ గతంలోనే అనారోగ్యంతో మృతిచెందగా నాయనమ్మ సంరక్షణలో ఉంటూ ఇంటర్ వరకు చదివాడు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో చెత్తను తరలించే ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుధాకర్ తెలిపారు.

విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడి అసభ్యకర ప్రవర్తన

భువనగిరి క్రైం: పరీక్ష రాస్తున్న విద్యార్థిని పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటన రాయగిరి యూనిటీ కాలేజీలో చోటు చేసుకుంది. భువనగిరి మండలంలోని ఓ కాలేజీకి చెందిన విద్యార్థినికి రాయగిరికి యూనిటీ కాలేజీలో ఇంటర్ పరీక్ష సెంటర్ పడింది. పరీక్ష ప్రారంభంలో మహిళా ఇన్విజిలేటర్ ఉండగా చివరిలో ఆమె వాష్ రూం కోసం బయటకు వెళ్లింది. ఈ క్రమంలో రిలీవర్‌గా మరో ఉపాధ్యాయుడు ఇన్విజిలేషన్ బాధ్యతలు తీసుకున్నాడు. తరగతి గదిలో విద్యార్థిని ఒక్కతే పరీక్ష రాస్తుండగా సదరు ఉపాధ్యాయుడు ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆ విద్యార్థిని సదరు ఉపాధ్యాయుడిని నిలదీయగా చేయిచేసుకున్నాడు. అనంతరం ఆ విద్యార్థిని 100కు సమాచారమిచ్చి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

డీజిల్ దొంగల ముఠా అరెస్ట్

- రూ. 6లక్షల నగదు, 700 లీటర్ల డీజిల్, నాలుగు వాహనాలు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నల్లగొండక్రైం: అంతర్‌రాష్ట్ర డీజిల్ దొంగల ముఠాను వాడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 6లక్షల నగదు, 700 లీటర్ల డీజిల్, మూడు ఇన్నోవా వాహనాలతో పాటు జైలో వాహనాన్ని, డీజిల్ క్యాన్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. నేర సంఘటన వివరాలను మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా గొల్లపల్లి మండలం సీతారాంపురం తండాకు చెందిన బానావత్ బాలబద్దునాయక్, బానావత్ గోవింద్‌నాయక్, మేరజుత్ శ్రీనునాయక్, ముడావత్ వెంకటేశ్వర్లు నాయక్, మేరజుత్ బాబ్రినాయక్‌తో పాటు నల్లగొండ జిల్లా నేరడుగొమ్ము మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వడిత్యరాజునాయక్‌లు ముఠాగా ఏర్పడ్డారు. వీరు కొంతకాలంగా రహదారుల వెంట నిలిపి ఉంచి వాహనాల్లో డీజిల్ చోరీ చేస్తున్నారు. వీరు వాహనాల్లో క్యాన్లు, పైపులు వెంట వేసుకుని లారీల డీజిల్ మూతను పగులకొట్టి వాటిల్లోని డీజిల్‌ను చోరీ చేస్తున్నారు. ఆ డీజిల్‌ను క్యాన్లలోకి నింపి వాహనాల్లో తరలించి తక్కువ ధరకు వివిధ ప్రాంతాల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. వాడపల్లి పోలీసులు ఆర్‌టీఏ బోర్డర్ చెక్ పోస్టు వద్ద ఇటీవల వాహనాలు తనిఖీ చేపట్టారు. ఆరుగురు వ్యక్తులు రెండు ఇన్నోవా వాహనాల్లో ఆంధ్రాకు వెళుతుండగా అనుమానంతో వారిని తనిఖీ చేయగా డీజిల్ క్యాన్లు, పైపులు బయటపడ్డాయి. వారిని విచారించగా డీజిల్ చోరీ చేస్తున్న విషయాన్ని ముఠా సభ్యులు ఒప్పుకున్నారు. నెల రోజులుగా దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన నేనావత్ టాకు నాయక్ అలియాస్ ఠాగూర్‌కు 1500 లీటర్ల డీజిల్‌ను తక్కువ ధరకు అమ్మారు. అతని నుంచి తిరిగి 700 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగల నుంచి డీజిల్ కొన్న ఠాగూర్ పరారీలో ఉన్నారు. వీరు నడుపుతున్న నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, ఇవి ఎలా కొనుగోలు చేశారో దర్యాప్తు జరుపుతామన్నారు. కేసు పరిశోధనలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌ఐ రవికుమార్, సీఐ వీరబాబు, సీసీఎస్ కానిస్టేబుల్ విష్ణులను డీఎస్పీ అభినందించారు.

సాయినాథుడిని దర్శించుకున్న స్టేట్‌ఫుడ్ కమిషన్ చైర్మన్



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్

చింతపల్లి : తెలంగాణ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నిరంజన్, ఆమనగల్ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, ఎంపీటీసీ కుమార్, అనిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గొంతు కోసి హత్యాయత్నం

ఆత్మకూరు(ఎం): ముగ్గురు వ్యక్తులు ఓ వ్యక్తి గొంతు కోసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండలంలోని రాయిపల్లి గ్రామ పరిధిలోని బిక్కేరు వాగులో చోటు చేసుకుంది.భువనగిరి మండలం అనాజిపురం గ్రామానికి చెందిన సుధాకర్ మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో బుధవారం ఓ ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడు. భువనగిరి చెందిన ముగ్గురు వ్యక్తులు వచ్చి మేస్త్రీగా పని చేస్తున్న సుధాకర్‌ను కల్లు కోసమని వెంట తీసుకుపోయారు. రాయిపల్లి బిక్కేరు వాగులోకి చేరుకున్నాక వారు సుధాకర్ గొంతు కోసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతరం అతడు చనిపోయాడనుకుని వారు అక్కడ నుంచి పరారయ్యారు. దీంతో సుధాకర్ అరుస్తుండగా సమీపంలో ఉన్న రైతులు పోలీసులకు సమాచారం అందచేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సుధాకర్‌ను చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. కేసు విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ దొమ్మేటి నాగరాజు తెలిపారు.

అపరిశుభ్రమైన ఐస్‌క్రీమ్ నిల్వల పట్టివేత

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో బుధవారం ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. రాంనగర్‌కాలనీలో కేంద్రంగా ఏర్పాటు చేసుకొని అమ్మకాలు చేస్తున్న అపరిశుభ్రమైన ఐస్‌క్రీమ్ నిల్వలను పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హర్దోయ్ జిల్లా చాంద్‌సైరా గ్రామానికి చెందిన ముఖేష్‌కుమార్(35) కొంతకాలంగా స్థానికంగా ఐస్‌క్రీమ్ విక్రయాలు చేస్తున్నాడు. హైదరాబాద్‌లోని ఉప్పల్‌లోని బెర్రీ ఐస్‌క్రీమ్ కంపెనీ నుంచి వివిధ రకాల ఐస్‌క్రీమ్‌లను కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకువస్తాడు. వాటిని పలు మార్గాల ద్వారా అమ్మకాలు చేస్తుంటాడు. కాగా, ఏమాత్రం పరిశుభ్రంగా లేని అపరిశుభ్రమైన ఐస్‌క్రీమ్‌లను విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. పెద్ద ఎత్తున నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడితోపాటు స్వాధీనం చేసుకున్న ఐస్‌క్రీమ్‌లను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

పోచంపల్లిలో కొలంబియా దేశస్తులు



టైఅండ్ డై విధానాన్ని పరిశీలిస్తున్న విదేశీయులు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లిలో బుధవారం వోల్గా గ్రూప్‌కు చెందిన 9 మంది కొలంబియా దేశస్తులు సందడి చేశారు. భారతదేశ పర్యటన నిమిత్తం వచ్చిన వీరు ఇక్కత్ వస్త్రాల తయారీ విధానాలను తెలుసుకొనేందుకు పోచంపల్లికి వచ్చారు. కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌ను సందర్శించి అక్కడ రంగులద్దకం, చిటికి కట్టడం, ఆసుపోయడం, డిజైన్లు వేయడం, మగ్గాలపై చీరల తయారీ విధానాలను స్వయంగా పరిశీలించారు. ఎంతో కళాత్మకంగా తయారు చేస్తున్న చేనేత వస్త్రాలను చూసి మంత్రముగ్దులయ్యారు. తమ మొబైల్స్‌లో వస్త్రాల తయారీ ప్రక్రియలను ఫొటోలు తీసుకొన్నారు. అలాగే చేనేత కళాకారులతో కలిసి సెల్ఫీ ఫొటోలు తీసుకొని ఎంతో గర్వంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. వీరికి టూరిస్ట్ గైడ్ మధు ఇక్కత్‌పరిశ్రమపై మార్గదర్శకం చేశారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి


రామగిరి(నల్లగొండ): కుక్కల దాడిలో 11గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన జక్కల వెంకన్న యాదవ్ గొర్రెలను కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం గ్రామ సమీపంలోని 28గొర్రెలను దొడ్డిలో తోలి ఇంట్లో పడుకున్నాడు. రాత్రి సమయంలో దొడ్డిలోకి ప్రవేశించి మందపై దాడి చేసి 11 గొర్రెలను చంపివేశాయి. సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశాడు.

సుల్తాన్‌పురంలో 20గొర్రె పొట్టేళ్లు..

గుర్రంపోడు : మండలంలోని సుల్తాన్‌పురం గ్రామంలో మంగళవారం రాత్రి మృగశిర సత్యనారాయణ ఇంటి ఆవరణలోని దొడ్డిలోకి కుక్కలు చొరబడి దాడి చేయడంతో 20పొట్టేళ్లు మృతిచెందాయి. మరో 20 గొర్రె పొట్టేళ్లు దాడిలో గాయపడ్డాయి. నాలుగు లక్షల మేరకు నష్టం జరిగిందని రైతు తెలిపాడు. సంఘటన స్థలాన్ని మండల పశువైద్యాధికారి అశోక్ పరిశీలించారు.

ఖిలా అభివృద్ధికి రూ.100 కోట్లు

- స్వదేశీ దర్శన్ కింద మంజూరు చేసిన కేంద్రం
- తొలి విడతలో రూ.69 కోట్లతో పనులు
- నేడు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేయనున్న ప్రధాని నరేంద్రమోదీ



భువనగిరి : భువనగిరి ఖిలా అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. స్వదేశీ దర్శన్ కింద పలు అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేయనున్నారు. భువనగిరి కోటను అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించడం, నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. దీంతో కోట అభివృద్ధి కలగానే మిగిలింది. కేంద్ర నిర్ణయంతో పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చేపట్టనున్న పనులు ఇవీ..

ఖిలాపైకి రోప్‌వే, పార్కులు, విశ్రాంతి భవనాలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, మ్యూజియం, రోప్‌వే స్టేషన్ వద్ద కన్వెన్షన్ హాల్, ఖిలా పైకి వెళ్లేందుకు లిఫ్టులు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఖిలా ప్రవేశ ద్వారం వద్ద ఎలివేషన్ నిర్మించనున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటికే ఎల్‌అండ్‌టీ సంస్థ డీపీఆర్‌ను రూపొందించింది. రోప్‌వే ఏర్పాటుకు 3 ఎకరాల భూమి కూడా కొనుగోలు చేశారు.

మొదటి విడతలో రూ.69 కోట్లు

ఖిలాను స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద రూ.100 కోట్లతో అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. మొదటి విడతలో రూ. 69 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టనున్న పనులకు ప్రధాని మోదీ గురువారం వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎల్‌అండ్‌టీ సంస్థ అధికారులు ఖిలా అభివృద్ధికి సంబంధించిన విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించనున్నారు. ఈ కార్యక్రమానికి మినిస్ట్రీ ఆఫ్ టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ మాతోసి భాస్కర్, జనరల్ మేనేజర్ మందడి ఉపేందర్‌రెడ్డి, డిప్యూటీ మేనజర్ నేత్ర హాజరు కానున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఖిలా అభివృద్ధికి కేంద్రం స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద మొదటి విడుత నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టనున్న పనులకు ప్రధాని మోదీ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించనున్నారు. ఎల్‌అండ్‌టీ సంస్థ వారు ఖిలా డీపీఆర్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేశాం.

– ధనుంజయనేయులు, ఇన్‌చార్జి జిల్లా టూరిజం అధికారి